సాక్షి శ్రీకాకుళం

శనివారం । 18 । జనవరి । 2025



నవోదయ పరీక్షకు వేళాయె

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష నేడు జరగనుంది. ఏర్పాట్లు పూర్తి చేశారు.

- IIలో



సముద్ర స్నానానికి దిగి..

సముద్ర స్నానానికి దిగి ఓ యువకుడు గల్లంతయ్యాడు. వజ్రపుకొత్తూరులో ఘటన జరిగింది.

- IIలో

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

గార: వేసవికి నీటి ఎద్దడి లేకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా అన్నారు. శుక్రవారం సాయంత్రం శాలిహుండం వాటర్ ప్రాజెక్టులో పంచాయతీ సెక్రటరీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రాజెక్టు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీటి లభ్యతకు కావాల్సిన చర్యలపై అంశాల వారీగా చర్చించారు. నీటి మళ్లింపు, అద్దె బోర్లు, అదనపు మోటార్లు స్టాండ్‌బైలో ఉంచడంపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మత్స్యకార గ్రామాల్లో ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు.

న్యూస్‌రీల్

ల్యాబ్‌టెక్నీషియన్, ఎఫ్‌ఎన్‌ఓ పోస్టుల భర్తీ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో ఉన్న పలు పీహెచ్‌సీల్లో ల్యాబ్ టెక్నీషియన్-1 (కాంట్రాక్టు), ఎఫ్‌ఎన్‌ఓ-05 (ఔట్ సోర్సింగ్) పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లుగా డీఎంహెచ్‌ఓ బాలమురళీకృష్ణ తెలియజేశారు. ఈ మేరకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22 లోగా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి సమర్పించాలని ఆయన కోరారు.

వైద్యాధికారుల పోస్టుల భర్తీ

జిల్లాలో వైద్యారోగ్య శాఖ పరిధిలోని ఎన్‌ఆర్‌హెచ్‌ఎం, జిల్లా జనరల్ ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రుల్లో పనిచేసేందుకు గాను మొత్తం ఆరు పోస్టులను భర్తీ చేస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ బాలమురళీకృష్ణ ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు ఫిజీషియన్ 01, మెడికల్ ఆఫీసర్ 02, క్లినికల్ సైకాలజిస్టు 01, ఆప్తమాలజిస్టు 01, డెంటల్ టెక్నీషియన్ 01 తదితర పోస్టులను భర్తీ చేయనున్నట్లు, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22 లోగా తమ దరఖాస్తులను డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపించాలని, మరిన్ని వివరాలకు శ్రీకాకుళం.ఎపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

విజయదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ



అలంకరణలో విజయ దుర్గ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని నానుబాల వీధిలో వేంచేసిన విజయదుర్గా దేవి ఆలయంలో పుష్యమాస శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆమదాలవలసలో సినీ నటుల సందడి



శ్రీహరిపురంలో బంధువులతో కలిసి ఉన్న సినిమా నటులు దీపక్ సరోజ్, సందీప్ సరోజ్

ఆమదాలవలస: ఆమదాలవలస మండలం కొర్లకోటలో సినీనటులు సందడి చేశారు. గ్రామానికి చెందిన పేడాడ నర్సింగరావు, రమణికుమారిల కుమారులు దీపక్‌సరోజ్, సందీప్ సరోజ్‌లు సినీ నటులుగా చిన్ననాటి నుంచి రాణిస్తున్నారు. దీపక్ సరోజ్ అతడు, పోకిరి, లెజెండ్, ఆర్య, పౌర్ణమిలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేశారు. రోటి కాపడా రొమాన్స్, కమిటీ కుర్రోళ్లు, మిణుగురులు సినిమాల్లో సందీప్ సరోజ్ హీరో క్యారెక్టర్‌తోపాటు సైడ్ హీరోగా క్యారెక్టర్‌లు చేశారు. ప్రస్తుతం పలు సినిమాల్లో బిజీగా ఉన్నా వీరిద్దరు పండగకు సొంత గ్రామానికి వచ్చారు. అలాగే ఆమదాలవలస మండలం శ్రీహరిపురం గ్రామంలో గల వారి బంధువులు రాజశేఖర్ కుటుంబ సభ్యులతో శుక్రవారం కలిసి గడిపారు.

వదంతులు నమ్మవద్దు

పోలాకి: పోలాకి తీర ప్రాంత గ్రామాల్లో పులి సంచరిస్తోందన్న వదంతులను నమ్మవద్దని అటవీ శాఖ సెక్షన్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. డీఎల్‌పురం సెక్షన్ పరిధిలో పులి లేదా అలాంటి ఆకారంలో గల ఎలాంటి జీవి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు లేవని తేల్చిచెప్పారు. గురువారం రాత్రి కొత్తరేవు, కొవిరిపేట గ్రామాల మధ్యలో జీడిమామిడి తోటల్లో పులి కనిపించినట్లు సామాజిక మాధ్యమాల్లో షేర్‌చేస్తున్న ఫొటోలు, వీడియోలు సైతం ఫేక్ అని తెలిపారు. తీరప్రాంత గ్రామాల్లో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించామని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ మీదుగా శుక్రవారం పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. విశాఖ నుంచి భువనేశ్వర్ వైపు వెళ్లే ప్రశాంతి, రాజారాణి, ఇంటర్‌సిటీ, విశాఖ-బ్రహ్మపూర్, భువనేశ్వర్ హంసఫర్ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు సుమారు అర్ధగంట ఆలస్యంగా నడిచాయి. వందేభారత్ కూడా స్టేషన్‌లో ఆగి ఆలస్యంగా బయల్దేరింది.

తెగ తాగేశారు..

4 రోజులు.. రూ. 17.78 కోట్ల విక్రయాలు





- పండగ సందర్భంగా రౌండ్ ది క్లాక్ మద్యం విక్రయాలు
- ఎక్కడికక్కడ వెలసిన బెల్టు షాపులు

పెద్ద పండగ సందర్భంగా మద్యం ప్రియులు మత్తులో మునిగి తేలారు. 13వ తేదీ భోగి, 14వ తేదీ సంక్రాంతి, 15వ తేదీ కనుమ, 16వ తేదీ ముక్కనుమ రోజుల్లో విపరీతంగా మద్యం విక్రయాలు జరిగాయి. ఈ నాలుగు రోజుల్లో రూ. 17.78 కోట్ల మద్యం అమ్ముడు పోయింది. ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో అమ్మకాలు జరిగాయి. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి వంటి ప్రాంతాల్లో మద్యం ఎక్కువగా అమ్ముడు పోయింది. ప్రైవేట్ మద్యం షాపులు ముందస్తుగా డిమాండ్ ఊహించి కావాల్సిన మద్యాన్ని అందుబాటులో ఉంచారు. ఎచ్చెర్లలోని బేవరేజెస్ కార్పొరేషన్ గోదాంలో సైతం కావాల్సిన మద్యంను సరఫరాకు అందుబాటులో ఉంచారు. పండగ నాడు ప్రభుత్వం కూడా ప్రజారోగ్యంపై కాకుండా ఆదాయంపైనే దృష్టి పెట్టింది. ఫలితంగా ఎక్కడికక్కడ బెల్టుషాపులు వెలిశాయి. మద్యం షాపులు నిబంధనలు మేరకు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించాలి. బార్లు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటలు వరకు నిర్వహించాలి. కానీ పండగ సమయంలో రోజంతా మద్యం విక్రయాలు జరిగాయి. బెల్టు షాపుల్లో క్వార్టర్‌కు రూ. 50 వరకు అదనంగా పెంచేశారు. ఇన్ని బెల్టుషాపులు కళ్లముందే కనిపించినా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోనేలేదు.



వైన్ షాపులకు తరలిస్తున్న మద్యం

–ఎచ్చెర్ల క్యాంపస్ / శ్రీకాకుళం క్రైం

సొంత ఊరికి కొంత మేలు



పండగ పూట అమ్మకో చీర పెట్టడం బిడ్డకు ఎనలేని సంతోషం. నాన్నకు ఓ జత బట్టలు కొనివ్వడం ఎంతో సంతృప్తి. అమ్మకు చీర పెట్టినంత సంబరంగా కొందరు సొంతూరికి సేవ చేస్తున్నారు. తండ్రిని గౌరవించినంత ఆనందంగా సొంత బడిని బాగు చేసుకుంటున్నారు. చదువు నేర్పిన విద్యాలయం రుణం తీర్చుకుంటున్నారు. నడత నేర్పిన ఊరిదారులను మర్చిపోకుండా తమ వంతు సాయం అందిస్తున్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్:

ఉద్దాన ప్రాంతం మోట్టూరు పంచాయతీ పరిధిలో గల వంకులూరు గ్రామానికి చెందిన గుంటు వేణుగోపాలరావు 4 దశాబ్దాల కిందట గ్రామాన్ని విడిచిపెట్టి గుజరాత్‌లో కుటుంబంతో స్థిరపడ్డారు. ఊరికి దూరంగా ఉన్నా.. ఆయన ఆలోచనలు మాత్రం ఇక్కడే తిరుగుతున్నాయి. ఊరికి ఎలాగైనా ఉపకారం చేయాలని తలచి తన సొంత డబ్బుతో సామాజిక భవనాలు, ఆలయాలు నిర్మించారు. గ్రామంలో సోలార్ దీపాలు ఏర్పాటు చేసి వెలుగులు నింపుతున్నారు. విపత్తుల సమయంలో ప్రజల అవసరాలను తీర్చుతున్నారు.

ఊరే నా కుటుంబం



దేవుడి దయ, నా శ్రమతో పారిశ్రామిక వేత్తగా ఎదిగి గుజరాత్‌లో స్థిరపడ్డాను. కానీ నా ఆలోచనలు మాత్రం పుట్టిన ప్రాంతంపైనే ఉన్నాయి. పుట్టిన ఊరికి ఎంత చేసినా రుణపడి ఉంటాం. అందుకే గ్రామ అభివృద్ధికి నేను సంపాదించిన మొత్తంలో కొంత సాయం అందిస్తున్నాను.

– గుంటు వేణుగోపాల్‌రావు, పారిశ్రామిక వేత్త, వంకులూరు,వజ్రపుకొత్తూరు



రూ.38 లక్షల సొంత ఖర్చుతో నిర్మించిన సామాజిక భవనం

ఊరికి ఊతం..

- తన తల్లిదండ్రులు గుంటు జగన్నాథం కళావతమ్మ జ్ఞాపకార్థంగా గ్రామంలో రూ.38 లక్షల వ్యయంతో సామాజిక భవనం నిర్మించారు.
- రూ.1.25 లక్షల వ్యయంతో సోలార్ లైట్లు వేశారు.
- పోలీస్‌స్టేషన్ అభివృద్ధికి రూ.50వేలు సాయం చేశారు.



సైకిల్ షెడ్ ప్రారంభోత్సవంలో సినీ నటుడు సుమన్‌తో దాము

బడి రుణం తీర్చుకుంటూ..

శ్రీకాకుళం కల్చరల్: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని వీరఘట్టం మండలం కత్తుల కవిటి గ్రామంలో జన్మించిన దాము గేదెల చదువు నేర్పిన బడి రుణం తీర్చుకుంటున్నారు. ఉన్నత చదువులు చదువుకుని అమెరికాలోని న్యూజెర్సీలో ఉంటున్న దాము స్వగ్రామమైన కత్తుల కవిటి గ్రామానికి విద్యాపరంగా ఎన్నో సేవలను అందిస్తున్నారు. దాము స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ చేసి అమెరికా వెళ్లి సెటిలయ్యారు. అనంతరం స్వగ్రామానికి, సొంత బడికి మేలు చేయడం ప్రారంభించారు.

- తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటుగా అక్కడి విద్యార్థులు బాగా చదువుకునేందుకు ప్రోత్సాహంగా యూనిఫామ్స్, స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నారు.
- జిల్లా పరిషత్ హైస్కూల్ నిర్మాణం, విస్తరణ కోసం తనవంతు చేయూత అందించారు. అప్పట్లో రూ.10లక్షలు విలువ చేసే స్థలం, అందులో 5 గదుల నిర్మాణానికి అవసరమైన నిధులు అందించారు.
- ఇటీవలే 2022లో ఆ స్కూల్‌లో ఉపాధ్యాయుల కోసం ఒక సైకిల్ స్టాండ్‌ను నిర్మించారు.
- ఊరిలో వైద్యపరంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, ఆపరేషన్లు కూడా చేయించారు.
- పేదలకు అన్నదానం, నిరంతర మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు

సేవలోనే ఆనందం



విద్యతోనే అభివృద్ధి ఉంటుంది. అందుకే విద్య కోసం ఎంతైనా సేవ చేస్తాను. అలాగే సాంస్కృతిక రంగం కోసం, ఆధ్యాత్మిక రంగంలోనూ నా వంతు సేవలు అందిస్తున్నాను.

– దాము గేదెల, న్యూజెర్సీ

- ఏటా 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ. 50 వేలు అందజేస్తున్నారు.
- సామాజిక భవనంలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు.
- సీసీ రోడ్డు నిర్మాణం కోసం కొంత స్థలం వితరణగా అందించారు.
- కరోనా విపత్కర పరిస్థితిలో నిత్యావసర సరుకులతో పాటు మందులను అందజేశారు.

ఆదిత్యుని సన్నిధిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తుల బృందం



ఆదిత్యుని జ్ఞాపికను అందుకుంటున్న జస్టిస్ టి.వినోద్‌కుమార్ దంపతులు

అరసవల్లి,జలుమూరు: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ జె.శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ ఈఓ వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు వేదమంత్రోచ్ఛరణల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయ దర్శనం చేయించి ఆలయ విశిష్టతను శంకరశర్మ వారికి వివరించారు. వీరికి ఆలయం తరపున ఆదిత్యుని జ్ఞాపికను ఆలయ ఈఓ వై. భద్రాజీ అందజేశారు. వీరి వెంట జిల్లా అడిషనల్ సబ్ జడ్జి యుగంధర్, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు, డీఎస్పీ వివేకానంద తదితరులున్నారు. శ్రీముఖలింగం క్షేత్రాన్ని కూడా వీరు దర్శించుకున్నారు.



జ్ఞాపికను అందుకుంటున్న జస్టిస్ కె.లక్ష్మణ్ దంపతులు



జ్ఞాపికను అందుకుంటున్న జస్టిస్ జె.శ్రీనివాసరావు దంపతులు

గోదాముల సామర్థ్యం పెంపే లక్ష్యం



గోదాముల్లో సరుకులను పరిశీలిస్తున్న స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్ ఎండీ సురేష్‌కుమార్

పొందూరు: రాష్ట్రంలో స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉన్న గోదాముల సామర్థ్యం పెంపు కోసం నూతన గోదాముల నిర్మాణం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర గిడ్డంగులు, గోదాముల సంస్థ ఎండీ జి.సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక స్టేట్ వేర్‌హౌస్ గోదాములను శుక్రవారం పరిశీలించారు. నూతన గోదాముల నిర్మాణానికి, కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందని చెప్పారు. ఆయనతో శ్రీకాకుళం రీజనల్ మేనేజర్ రాజశ్రీ, పొందూరు మేనేజర్ సునీత, అధికారులు ఉన్నారు.

నేటి నుంచి మార్కెట్ విలువపై ప్రజాభిప్రాయ సేకరణ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మార్కెట్ విలువ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్న సందర్భంగా ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18వ తేదీన డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో సలహాలు, సూచనలు, అభ్యంతరాలను తెలియజేయాలని కోరారు. ఈ నెల 24వ తేదీన వాటిని పరిశీలించి వాటికి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

వాటన్నింటినీ పరిశీలించిన అనంతరం 25వ తేదీన రివిజన్ కమిటీ ఫైనల్ అప్రూవల్ ఇస్తుందని తెలిపారు. ఈ నెల 27వ తేదీన వివరాలన్నీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కొత్త ధరలు అమలుచేయడం జరుగుతుందని తెలిపారు.

దివ్యాంగులను ప్రోత్సహిద్దాం: కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల్లో సృజనాత్మకత వెలికి తీసి వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజ్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవితతో కలసి వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముందుగా రిజిస్ట్రేషన్ కౌంటర్ పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆరా తీసి పలు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకొని ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. స్వాభిమాన్ కార్యక్రమంలో డీపీఓ కె.భారతీసౌజన్య, జిల్లా ఉపాధి కల్పనాధికారిణి సుధా, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.నగేష్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్య కిరణ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్ పాల్గొన్నారు.

ముద్దాయిలకు మౌలిక వసతుల కల్పనపై దృష్టి

గార: జైళ్లలో కుల ఆధారిత వివక్ష సంఘటనలపై అంచనా వేసేందుకు జిల్లా అధికారులు శుక్రవారం జిల్లాజైలును సందర్శించారు. అంపోలు పరిధిలోని జిల్లా జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, పలు శాఖల అధికారులు సందర్శించారు. జైలులోని పరిసరాలను పరిశీలించి, అవసరమైన మౌలిక వసతులపై కల్పనపై దృష్టి సారించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు. అన్ని అంశాల వారీగా తనిఖీలు చేశారు. మహిళా బ్యారెక్‌లో మహిళా ఖైదీలతో వారి వసతులపై ఆరా తీశారు. జైల్లో తాగునీరు, వైద్యంపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి టీవీ బాలమురళీకృష్ణ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య, సంక్షేమశాఖాధికారి వై.విశ్వమోహన్, ఎంప్లాయిమెంట్ అధికారి కె.సుధ, జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాధ స్వామి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి జె.ఉమామహేశ్వరరావు, జైలు అధికారులు పాల్గొన్నారు.




జిల్లా జైలు సందర్శనలో కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎస్పీ, పలు శాఖల అధికారులు



మంచు వాన

పొగమంచు కమ్ముకుంటోంది. ఉదయం 8 గంటలైనా మంచు తెరలు వీడకపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. జి.సిగడాం పరిసర ప్రాంతాల్లో విపరీతంగా మంచు పడుతోంది. దీని వల్ల మామిడి, జీడి పంటకు నష్టం కలుగుతుందని రైతులంటున్నారు.

– జి.సిగడాం



క్లుప్తంగా

ఎమ్మార్పీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఆహార ప్రాసెసింగ్ రంగంలో ఉద్యోగాల భర్తీకి సీడాప్ ద్వారా శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్‌గా పనిచేయడానికి మొత్తం 30 ఉద్యోగాలకు గాను అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరారు. ప్రోత్సాహకాల ఆధారంగా వేతనం ఉంటుందని, ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్, ఆహార ప్రాసెసింగ్ లేదా సహజ వనరుల అభివృద్ధి రంగంలో అనుభవం ఉంటే ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. నవంబర్ 1, 2024 నాటికి 21–30 సంవత్సరాలు వయసు ఉన్నవారు అర్హులని, దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 20, 2025 చివరి తేదీగా నిర్ణయించామని, రాత పరీక్ష జనవరి 24న ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ ఫొటోలతో కలిపి జనవరి 20, 2025 లోపు డీఆర్‌డీఏ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. సమాచారం కోసం 7989744612, 9912557054 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి



శతాధిక వృద్ధురాలు రత్నాయమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కంచిలి: మండలంలోని కుత్తుం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు తోలాన రత్నాయమ్మ శుక్రవారం మృతిచెందారు. ఈమె 1921వ సంవత్సరం ఫిబ్రవరి 28న జన్మించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. గ్రామంలో పెద్ద దిక్కుగా ఉన్న రత్నాయమ్మ మృతిచెందడంతో గ్రామస్తులంతా మృతదేహం వద్దకు చేరి, తమ సానుభూతిని తెలిపారు. ఆమె మృతదేహానికి కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు.

రథసప్తమి ఏర్పాట్లపై సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామీణ క్రీడలను గుర్తించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో నిర్వహించబోయే రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి శుక్రవారం జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27వ తేదీన జిల్లా అంతటా (స్కూల్స్, కళాశాలలు) సూర్య నమస్కారాలు చేయాలన్నారు. 2వ తేదీన ఉదయం 8 గంటలకు సూర్య నమస్కారాలు 80 అడుగుల రోడ్డులో ఏర్పాటు చేస్తారని, మొబలైజేషన్ ఆయుష్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ జగదీష్ చూడాలన్నారు. అదే రోజు ఉదయం 10 గంటలకు మున్సిపల్ గ్రౌండ్ లో స్పోర్ట్స్, వాలీ బాల్, కబడ్డీ నిర్వహించాలని డీఎస్‌డీఓను ఆదేశించారు. క్రీడలు 2, 3 తేదీల్లో ఉంటాయన్నారు. 80 అడుగుల రోడ్డులో రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు చూడాలని సంప్రదాయం స్కూల్ డైరెక్టర్ స్వాతీ సోమనాథ్‌కు సూచించారు. 3వ తేదీన లేజర్ షో, క్రేకర్ షో ఉంటాయని, హెలీకాప్టర్ టూరిజం, తదితరమైనవి ఉంటాయని వెల్లడించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మిల్లు జంక్షన్ వరకే బస్సులు వస్తాయని డీఎస్పీ వివేకానంద కలెక్టర్‌కు వివరించారు. మొబైల్ టాయిలెట్‌లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌నకు అధ్వానంపేట హెచ్ఎం



అరుణకుమారి

జి.సిగడాం: మైసూరులో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం ఉపాధ్యాయ వర్క్‌షాపునకు జిల్లా నుంచి జి.సిగడాం మండలం అధ్వానంపేట పాఠశాలకు ప్రధానోపాధ్యాయురాలు కూర్మాన అరుణకుమారిని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు ఆదేశాలను శుక్రవారం జారీ చేశారని ఎంఈఓ అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నుంచి అరుణకుమారిని ఎంపిక చేయడంతో ఎంతో ఆనందంగా ఉందని ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నవోదయం పరీక్షకు వేళాయె


- నేడు జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష
- మొత్తం 14 బ్లాకుల పరిధిలో 32 కేంద్రాల కేటాయింపు
- 32 కేంద్రాలకు సీఎస్‌లు, పరిశీలకులు, సిబ్బంది నియామకం
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ, జేఎన్‌వీ అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ, సరుబుజ్జిలి: నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధమైంది. జవహర్ నవోదయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశాలకు శనివారం ప్రవేశ పరీక్ష జరగనుంది. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ, జవహర్ నవోదయ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాలకు మెటీరియల్స్‌ను పరీక్ష కేంద్రాలకు చేరవేశారు.

32 కేంద్రాలు.. 8290 మంది విద్యార్థులు

ఆరో తరగతిలో ప్రవేశానికి జూలై నెలాఖరులో నోటిఫికేషన్ విడుదల కాగా సెప్టెంబర్ నెలాఖరు వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ విధంగా జిల్లాలో జేఎన్‌వీ ప్రవేశ పరీక్షకు 8290 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. నేడు జరిగే ఈ ప్రవేశ పరీక్షకు 14 బ్లాకుల పరిధిలో 32 కేంద్రాలను కేటాయించారు. ఇచ్ఛాపురం 3, పలాస 3, వీరఘట్టం 1, శ్రీకాకుళం 5 కేంద్రాలతోపాటు ఆమదాలవలస, కోటబొమ్మాళి, కొత్తూరు, మందస, నరసన్నపేట, టెక్కలి, పాలకొండ, పొందూరు, రణస్థలం, పాతపట్నంలో రెండేసి చొప్పున కేంద్రాలు కేటాయించారు. 32 పరీక్ష కేంద్రాలకు 32 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, పరిశీలకులను నియమించారు. వీరికి ఇప్పటికే సమావేశాలు నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాలకు నామినల్ రోల్స్, ఓఎంఆర్ సీట్లు, ఇతర మెటీరియల్స్‌ను చేరవేశారు. ప్రశ్నపత్రాలను శనివారం ఉదయం 9 గంటలకు నేరుగా పరీక్ష కేంద్రాలకు చేరవేస్తారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరగనుండగా.. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జేఎన్‌వీ ప్రిన్సిపాల్ దాసరి పరశురామయ్య ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సీటొస్తే సౌకర్యాలు బోలెడు..



స్మార్ట్ బోధన. ఆన్‌లైన్ పాఠాల్లో నిమగ్నమైన విద్యార్థులు

జిల్లాలోని సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అన్ని వసతులు, సౌకర్యాలు మెండుగా ఉన్నాయి. ఉత్తమ బోధన అందిస్తున్నారు. విద్యాలయంలో తరగతులకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యానికి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మిటరీలు, భోజనశాలలు, బోధకులు, సిబ్బందికి ప్రత్యేక క్వార్టర్స్‌ను నిర్మించారు. విద్యాలయం ఆవరణలో క్రీడల కోసం ప్రత్యేకంగా మైదానాన్ని తీర్చిదిద్దారు. ఆటపాటలు, యోగా వంటివి నిర్వహిస్తుంటారు. విద్యార్థుల కోసం వ్యాయామ శాలలు ఉన్నాయి. స్మార్ట్ తరగతుల కొనసాగిస్తున్నారు. సైన్సు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం వంటి సౌకర్యాలు ఉన్నాయి.

80 సీట్ల భర్తీకి పరీక్ష

జేఎన్‌వీల్లో 6వ తరగతిలో 80 సీట్లను భర్తీ చేయనున్నారు. ఇందుకు ప్రవేశపరీక్ష నిర్వహించి మార్కులు ఆధారంగా ఎంపిక చేస్తారు. 75 సీట్లు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి కేటాయిస్తారు. ఐదు సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు నిర్దేశించారు. జిల్లా జనాభా ప్రాతిపదికన ఎస్టీలకు 15 శాతం, ఎస్సీలకు 7.5 శాతం, బాలికలకు 1/3 శాతం, విభిన్నప్రతిభావంతుల(దివ్యాంగులు)కు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు.



జవహర్ నవోదయ విద్యాలయం వెన్నెలవలస

పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం



జిల్లాలో నేడు 6వ తరగతిలో ప్రవేశాలకుగాను జరిగే జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. 32 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు సీఎస్‌లను నియమించాం. పరిశీలకులను నియమించాం. అన్ని సూచనలు చేశాం. విద్యార్థులకు పరీక్ష కేంద్రాలకు గంటన్నర ముందే చేరుకోవాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

ప్రశాంతంగా పరీక్షకు హాజరుకావాలి



ప్రతిభ ఉన్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయాలు వరమనే చెప్పాలి. గొప్ప అవకాశంగా భావించి, సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో నేడు జరిగే ఈ పరీక్షకు 14 బ్లాకుల పరిధిలో 32 కేంద్రాలను కేటాయించాం. 8290 మంది విద్యార్థులు పరీక్షకు రిజిస్టర్ చేసుకున్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రశాంతంగా టెన్షన్ లేకుండా చేరుకోవాలి. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా డీఈఓ నేతృత్వంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం.

– దాసరి పరశురామయ్య, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయం, వెన్నెలవలస, సరుబుజ్జిలి

కేంద్ర జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలు స్థాపించారు. 6వ తరగతి మొదలుకుని 12వ తరగతి వరకు తరగతులు కొనసాగిస్తారు. ఏడు ప్రాంతీయ భాషల్లో, మాతృభాషల్లో బోధన జరుగుతుంది. ముఖ్యంగా మ్యాథ్స్, సైన్స్ పాఠ్యాంశాలను ఆంగ్లంలో, సామాజిక శాస్త్రాలు హిందీలో బోధిస్తారు. పదోతరగతి వరకు సెంట్రల్‌బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ)ను అమలు చేస్తారు.

పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్, జేసీ ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం స్కీమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయి కుమార్ మాట్లాడుతూ ఈ పథకం కింద రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఎస్ఎస్సీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ, బీటెక్ వంటి డిగ్రీలు ఉన్న వారెవరైనా అప్లై చేసుకోవచ్చని అన్నారు. దీనికి 21–24 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. http:pminternship.mca.gov.in/ofinలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికైన వారికి వన్–టైమ్ ఇన్సిడెంట్ గ్రాంట్ రూ.6000, భారత ప్రభుత్వం ద్వారా నెల వారి సహాయం రూ.4,500, పరిశ్రమలు ద్వారా ఏడాది పాటు రూ.500 చొప్పున అందిస్తారు. ఇంటర్న్‌షిప్‌లో చేరిన వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉంది. ఇప్పటికే ఉన్న పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ఇన్సూరెన్స్ కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 21 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వివరాల కోసం 9553228843, 8919366009 నంబర్లను సంప్రదించవచ్చు.

గ్యాస్ డెలివరీకి అదనపు వసూళ్లు వద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్యాస్‌ను లబ్ధిదారులకు అందించే సమయంలో డెలివరీ బాయ్‌లు అదనపు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని చోట్ల ఉచిత గ్యాస్ సరఫరాల చేసే సమయంలో అక్రమంగా రూ.150 వరకు డెలివరీ బాయ్స్ వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన తెలిపారు. గ్యాస్ ఏజెన్సీల చేతివాటాన్ని ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు. ఫిర్యాదులు రుజువైతే గ్యాస్ ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తే 91–9491222122 సెల్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. లేదా గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

పూర్తిస్థాయి బకాయిలు చెల్లించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయులకు అన్ని బకాయిలను అందజేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రవి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీఎఫ్ బకాయిలు, లోన్లు ఈఎల్, ఏపీజీఎల్‌కు బడ్జెట్ కేటాయింపులు చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే గ్రాంట్ విడుదల చేయాలని కోరారు. ఇటీవలి ఉపాధ్యాయుల మొండి బకాయిలకు సంబంధించి కొంతమేర బడ్జెట్ కేటాయింపు చేసినందుకు ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన అరసవల్లిలో కూల్చివేత పనులు



అరసవల్లి ఆలయం ముందు జింక్ షెడ్లను తొలిగిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి మహోత్సవాల్లో భాగంగా ఆలయానికి ముందు భాగంలో ఉన్న అన్ని భవన నిర్మాణాలన్నీ నేలమట్టం చేసేశారు. రూ.లక్షలాది విరాళాలతో దాతలు చేపట్టిన నిర్మాణాలు, ఆలయం ముందున్న రేకు షెడ్లు కూడా తొలగించేశారు. ఇక మిగిలిన ప్రధాన ఆలయ రాజగోపురానికి తగిలి ఉన్న రేకుషెడ్లను వెంటనే తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. పనుల పర్యవేక్షణ కోసం ప్రజారోగ్య విభాగ ఈఈ పాగిరి సుగుణాకరరావును ప్రత్యేకంగా నియమించారు. ఈ పనులను పూర్తి చేస్తూనే ఆలయ ప్రధాన రహదారి వైపుగా చేపట్టనున్న సుందరీకరణ పనుల బాధ్యత కూడా ఆయనకు అప్పగించారు.

సముద్ర స్నానానికి దిగి యువకుడు గల్లంతు

- ఆచూకీ కోసం పోలీసులు, మెరైన్ పోలీసులు గాలింపు



గల్లంతైన యువకుడు తరుణ్

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన యువకుడు జంగం తరుణ్ (16) శుక్రవారం సముద్ర స్నానానికి దిగి గల్లంతయ్యాడు. దీంతో యువకుడి ఆచూకీ కోసం గ్రామస్తులు, పోలీసులు, మెరైన్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. జంగం తరుణ్ కాశీబుగ్గలో గల ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మీడియట్ చదువుతున్నాడు. కళాశాలలకు సెలవులు కావడంతో సంక్రాంతికి గ్రామానికి వచ్చిన స్నేహితులతో కలిసి అదే రోజు ఉదయం సముద్ర స్నానాలకు దిగారు. అలల తాకిడి తరుణ్ ఒక్కసారిగా లోపలకు వెళ్లిపోయాడు. దీంతో తోటి స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోవడంతో భయాందోళనతో తీరానికి చేరుకొని స్థానిక మత్స్యకారుల సాయంతో గాలించారు. అయినప్పటికీ యువకుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, మెరైన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. తోటి స్నేహితుల నుంచి వివరాలు సేకరించారు. కాగా తరుణ్‌కు తల్లిదండ్రులు హేమంత్, తులసితో పాటు సోదరుడు శివ ఉన్నారు. అప్పటి వరకు తోటి మిత్రులతో కలిసి సరదాగా గడిపిన వ్యక్తి గల్లంతు కావడాన్ని యువకులు జీర్ణించుకోలేకపోతున్నారు. యువకుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబంతో పాటు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.

నేటితో ముగియనున్న దేహ దారుఢ్య పరీక్షలు



పరుగు పందెంలో అభ్యర్థులు



అభ్యర్థి ఎత్తు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నుంచి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో జరుగుతున్నాయి. ఈ పరీక్షలు శనివారంతో ముగియనున్నాయి. దేహదారుఢ్య పరీక్షలకు శుక్రవారం జిల్లా నుంచి 709 మంది హాజరు కావాల్సి ఉండగా, 479 మంది హాజరయ్యారు. తుది పరీక్షకు 327 మంది హాజరయ్యారు. ఎత్తు, ఛాతీకొలత, 1600 మీటర్లు, 100 మీటర్లు పరుగు, లాంగ్ జంప్ ఆధారంగా ఎంపిక నిర్వహిస్తున్నారు. అర్హత సాధించిన వారికి తుది రాత పరీక్ష నిర్వహిస్తారు. గతంలో హాజరు కాని వారికి సైతం అవకాశం కల్పిస్తున్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కచ్చితంగా అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలత, లాంగ్ జంప్ పరిశీలిస్తున్నారు. రన్నింగ్ సెన్సార్లు ద్వారా మెరిట్ తీసుకుంటున్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



బెంకిలిలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఆర్‌సీ నాగరాజు

సోంపేట: పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని డీపీఆర్‌సీ నాగరాజు సచివాలయ సిబ్బందికి సూచించారు. జింకిభద్ర, బెంకిలి సచివాలయాల పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీకేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను సేకరించి ఎరువుగా మార్చి సంపద సృష్టించాలన్నారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.శ్రీనివాసరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్టాఫ్ నర్సుల పోస్టుల దరఖాస్తుల గడువు

మహారాణిపేట (విశాఖ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసింది. ఆఫ్‌లైన్‌లో 8,250 దరఖాస్తులు వచ్చాయని, ఆన్‌లైన్ కూడా దరఖాస్తులు పెద్దసంఖ్యలో వచ్చాయని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ పి.రాధారాణి తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులకు ఏడాది ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖ జిల్లాలో ఖాళీగా ఉన్న 106 స్టాఫ్ నర్సు పోస్టులు భర్తీ చేస్తున్నారు. పూర్తి వివరాల కోసం https// nagendrasvst. word press. com వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

అక్రమ మద్యం అమ్మకంపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం పంచాయతీ లింగాలపేట గ్రామంలో దుంగ సూర్యనారాయణ అనే వ్యక్తి శుక్రవారం అక్రమంగా ఇంటి వద్ద మద్యం అమ్ముతుండగా ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్ పట్టుకున్నారు. ఎనిమిది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు.

బంగారం చోరీపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామానికి చెందిన పుల్లూరు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం చోరీ కేసు నమోదు చేశారు. గత ఏడాది నవంబర్‌లో బీరువాలో ఉన్న పావుతక్కువ రెండు తులాలు బంగారం చోరీ గురైనట్లు ఇటీవల గుర్తించినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ చెప్పారు.

మంచు చెట్టు



చిత్రంలో కనిపిస్తున్నది మంచు చెట్టు. సాధారణంగా చెట్టు ఆకులు ఏడాదంతా ఆకుపచ్చ రంగులో ఉంటాయి. శీతాకాలం రాగానే అవన్నీ తెలుపు రంగులోకి మారిపోయి ఇలా మంచు పడినట్లు భ్రమింపజేస్తాయి. కొత్తూరులోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో ఉన్న ఈ స్నోట్రీ అందరినీ ఆకర్షిస్తోంది.

– కొత్తూరు

తిరుగు ప్రయాణం

సంక్రాంతి పండగ కోసం తమ గ్రామాలకు వచ్చిన వలస కూలీలు, ఉద్యోగులు శుక్రవారం నుంచి తిరుగు ప్రయాణాలు మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. – ఆమదాలవలస



ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం, బ్రిడ్జిలపైన ఉన్న ప్రయాణికులు





రైళ్లు ఎక్కుతున్న ప్రయాణికులు